# నేడు ఎల్బీ స్టేడియంలో ప్రధాని సభ

- మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 వరకు
- స్టేడియం పరిసరాలలో ట్రాఫిక్ ఆంక్షలు

సిటీబ్యూరో, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): ఎల్బీ స్టేడియంలో మంగళవారం బీజేపీ నిర్వహిస్తున్న బహిరంగ సభకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో స్టేడియం పరిసరాలలో మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తూ నగర ట్రాఫిక్ అదనపు సీపీ సుధీర్ బాబు ఉత్తర్వులు జారీ చేశారు.

### పరిస్థితులను బట్టి ఆంక్షలు..

- ఏఆర్ పెట్రోల్ పంప్ జంక్షన్ నుంచి బీజేఆర్ విగ్రహం వైపు ట్రాఫిక్‌కు అనుమతి ఉండదు. వాహనాలను నాంపల్లి, రవీంద్రభారతి వైపు మళ్లిస్తారు.
- అబిడ్స్, గన్‌ఫౌండ్రి నుంచి బీజేఆర్ విగ్రహం వైపు ట్రాఫిక్‌ను అనుమతించరు. ఈ వాహనాలను ఎస్‌బీఐ గన్‌ఫౌండ్రి నుంచి చాపల్ రోడ్డులోకి మళ్లిస్తారు.
- ట్యాంక్‌బండ్ నుంచి బషీర్‌బాగ్ జంక్షన్ వైపు వెళ్లే వాహనాలను లిబర్టీ జంక్షన్ వద్ద హిమాయత్‌నగర్ వైపు మళ్లిస్తారు.

### పార్కింగ్ స్థలాలు

- సికింద్రాబాద్ వైపు నుంచి వచ్చే వాహనాలు అయాకర్ భవన్ వద్ద ఆగి, వాహనాలను ఎన్టీఆర్ స్టేడియంలో పార్కు చేయాలి.
- మెహిదీపట్నం వైపు నుంచి వచ్చే వాహనాలు పబ్లిక్ గార్డెన్ వద్ద ఆగి, గార్డెన్ లోపలికి వెళ్లి పార్కు చేయాలి.
- ఎల్బీనగర్ వైపు నుంచి వచ్చే వాహనాలు పబ్లిక్‌గార్డెలో ఆగి, వాహనాలను నిజాం కాలేజీ గ్రౌండ్‌లో పార్కు చేయాలి.
- ముషీరాబాద్, అంబర్‌పేట, హిమాయత్ నగర్ వైపు నుంచి వచ్చే వాహనాలను నిజాం కాలేజీ గ్రౌండ్‌లో పార్కు చేసుకోవాలి.
- వీఐపీ వాహనాలను టెన్నీస్ కోర్టులో పార్కు చేయాలి.
- మీడియా వాహనాలు నిజాం కాలేజీ ఫస్ట్ గేట్ వద్ద ఆగి.. మహబూబ్‌కాలేజీలో పార్కు చేయాలి.

## నేడు ఎన్టీఆర్ పార్కు, లుంబినీ పార్కుల మూసివేత

సిటీబ్యూరో, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): నగరంలో ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నికల ప్రచార సభ నేపథ్యంలో మంగళవారం ఎన్టీఆర్ పార్కు, లుంబినీ పార్కులను మూసివేస్తున్నామని హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ ఎల్‌బీ స్టేడియంలో బహిరంగ సభను నిర్వహిస్తున్నది. దీంతో సందర్శకులకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉండటంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. సోమాజిగూడలోని రాజ్‌భవన్ నుంచి ఎల్‌బీ స్టేడియం వరకు ప్రధాని రోడ్డ మార్గంలో వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో భద్రతా చర్యల్లో భాగంగా పార్కులను మూసి ఉంచాలని పోలీసు ఉన్నతాధికారుల సూచించారు.ఈ మేరకు హెచ్‌ఎండీఏ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రజలు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## బీసీలకు కాంగ్రెస్ మొండి చేయి చూపింది

### బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

రవీంద్రభారతి, నవంబర్ 6: వచ్చే పార్లమెంట్ సమావేశాల్లోనే బీసీ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలని, బీసీలకు రాజకీయ రిజర్వేషన్లను ప్రవేశపెట్టాలని, ఇందుకు అన్ని పార్టీలు బీసీ బిల్లుకు మద్దతు తెలుపాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు(ఎంపి) ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు బీసీ బిల్లుకు మద్దతు తెలుపాలని కోరారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ బీసీలకు అధిక



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

శాతం ఎమ్మెల్యే సీట్లు కేటాయిస్తామని చెప్పి మొండి చెయ్యి చూపించిందన్నారు. ఈ సమావేశంలో నీల వెంకటేశ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కోమటికుంట ఆక్రమణలపై తీసుకున్న చర్యలు వివరించండి

### ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా నిజాంపేటలోని కోమటికుంట చెరువు ఆక్రమణల నివారణకు తీసుకున్న చర్యలను వివరించాలని ప్రభుత్వాన్ని హైకోర్టు కోరింది. తీసుకున్న చర్యలను వివరిస్తూ కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేసింది. సర్వే నం.127, 128, 137లో కోమటికుంట ఎఫ్‌టీఎల్ ప్రాంతంలో వాసవి ఇన్‌ఫ్రా ఎల్.ఎల్.పి. అక్రమ నిర్మాణాలు చేపట్టడంపై నిజాంపేట ప్రాంతానికి చెందిన ఎ.సతీష్ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాథే, జస్టిస్ ఎన్.వి.శ్రావణ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా.. అధికారులు పట్టించుకోలేదని పిటిషన్ తరపున న్యాయవాది చెప్పారు. హెచ్‌ఎండీఏ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ప్రస్తుతం సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. సర్వే పూర్తయ్యాక ఎఫ్‌టీఎల్ ప్రాంతంలో ఆక్రమణలు ఉంటే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ దశలో ధర్మాసనం జోక్యం చేసుకొని.. నిర్మాణాలు కొనసాగుతున్నాయంటూ ప్రశ్నించగా, న్యాయవాది ఇప్పటికే పూర్తి అయ్యాయన్నారు. వాదనల తర్వాత హైకోర్టు, హెచ్‌ఎండీఏ, నిజాంపేట మున్సిపల్ కమిషనర్, ఇరిగేషన్ శాఖ ఇంజినీరింగ్ అధికారులు, వాసవి ఇన్‌ఫ్రా ఎల్.ఎల్.పి.కి నోటీసులు జారీ చేసింది. విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.





## పోలీస్ ఫ్లాగ్ మార్చ్

సిటీబ్యూరో, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్భయంగా నిర్వహించేందుకు ''మీ కోసం మేమున్నాం.. ధైర్యంగా వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవాలి''.. అనే సందేశానిస్తూ సోమవారం నగరంలోని పలు ప్రాంతాల్లో స్థానిక పోలీసులు, కేంద్ర బలగాలతో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. బండ్లగూడ, నారాయణగూడ, గుడిమల్కాపూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాలలో ఫ్లాగ్ మార్చ్ కొనసాగింది.

## క్యాపిటల్ మార్కెట్ పెట్టుబడులు..

### అవగాహనతో ఆర్థిక మాంద్యానికి అడ్డుకట్ట

శామీర్‌పేట, నవంబర్ 6: క్యాపిటల్ మార్కెట్‌లో పెట్టే పెట్టుబడులపై అవగాహన పెంచుకుంటే ఆర్థిక మాంద్యానికి అడ్డుకట్ట వేయవచ్చని ఐపీఈ డైరెక్టర్ శ్రీనివాస మూర్తి అన్నారు. శామీర్‌పేటలోని ఐపీఈ కళాశాలలో సోమవారం బోధనా సిబ్బందికి ఎఫ్‌డీపీ (అధ్యాపక అభివృద్ధి) విద్యార్థులకు ఎఫ్‌ఎల్‌పీ (ఆర్థిక అక్షరాస్యత) కార్యక్రమాన్ని ఎన్ఐఎస్ఎం, ఆదిత్య బిర్లా సన్‌లైఫ్ మ్యూచవల్ ఫండ్‌తో కలిసి 'క్యాపిటల్ మార్కెట్‌లో పెట్టుబడులు' అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్యాపిటల్ మార్కెట్, మ్యూచవల్ ఫండ్స్‌పై అవగాహన పెంచుకుంటే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. అలాగే, ఆర్థిక మాంధ్యాన్ని కూడా తరిమికొట్టవచ్చన్నారు. తద్వారా దేశం అమృత్ కాల్(సుసంపన్నం)ను సొంతం చేసుకోవచ్చని తెలిపారు. ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు వక్తలు అవగాహన కల్పించారు. షేర్



ఎఫ్‌డీపీ, ఎఫ్‌ఎల్‌పీకి హాజరైన అధ్యాపకులు, విద్యార్థులు

మార్కెట్, మ్యూచవల్ ఫండ్‌లో ప్రణాళిక ప్రకారం పెట్టుబడులు పెడితే ఆర్థికంగా ఎదగవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్స్ డీన్ శ్రీకాంత్, ప్రోగ్రాం కన్వీనర్ రామకృష్ణ, కో– కన్వీనర్లు స్వాతి మాథూర్, కల్యాణి, ఇన్వెస్టర్ ఎడ్యూకేషన్, పంపిణీ అభివృద్ధి హెడ్ కేఎస్. రావు, ఆదిత్యబిర్లా సన్‌లైఫ్ సీనియర్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కులదీప్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలోని వివిధ కళాశాలలకు చెందిన 120 మంది అధ్యాపకులు, 300 మంది విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## కాలుష్య నియంత్రణ చర్యలను వివరించండి

### జీడిమెట్ల పారిశ్రామికవాడ వ్యవహారంపై హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ) : జీడిమెట్ల పారిశ్రామికవాడలో వ్యర్థాల నిర్వహణ ఏ విధంగా జరుగుతుందో తెలియజేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు కాలుష్య నియంత్రణ మండలిని హైకోర్టు ఆదేశించింది. కాలుష్య వ్యర్థాల నివారణకు తీసుకునే చర్యలు తెలియజేయాలని ఆదేశించింది. అధికారులు తగిన చర్యలు తీసుకోకుండా కాలుష్య వ్యర్థ జలాలను నాలాల్లోకి వదులుతున్నారంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై సోమవారం హైకోర్టు విచారణ జరిపింది. కౌంటర్ పిటిషన్లు దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, కాలుష్య నియంత్రణ మండలి, మేడ్చల్– మల్కాజిగిరి కలెక్టర్‌తో పాటు 69 పరిశ్రమలకు నోటీసులు జారీ చేసింది. వ్యర్థాలను శుద్ధి చేయకుండా నాలాల్లోకి వదిలేస్తున్నారంటూ సామాజిక కార్యకర్త పి.ఎల్.ఎన్. రావు దాఖలు చేసిన పిల్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాథే, జస్టిస్ ఎన్.వి. శ్రావణ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

## ప్రశాంత్‌రెడ్డిని కస్టడీకి అప్పగించాలి..

### పిటిషన్ దాఖలు చేసిన సిట్

నాంపల్లి కోర్టులు, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో 16వ నిందితుడిగా ఉన్న సాన ప్రశాంత్‌రెడ్డిని 5 రోజుల కస్టడీకి అప్పగించాలని సోమవారం సిట్ తరపున పీపీ కృష్ణయ్య పిటిషన్ దాఖలు చేశారు. న్యూజిలాండ్‌లో ఉద్యోగం చేస్తున్న ప్రశాంత్‌రెడ్డి.. కూతురి ఆరోగ్య రీత్యా భారత్‌కు వచ్చిన సమయంలో విమానాశ్రమంలోనే అతడిని అరెస్టు చేసి, సిట్ అధికారులకు అప్పగించారు. నాన్ బెయిలబుల్ వారెంట్‌పై నిందితుడిని అరెస్టు చేశారు. అనంతరం సిట్ అధికారులు 12వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు ఎదుట శనివారం హాజరుపర్చగా.. మెజిస్ట్రేట్ జి.ఈశ్వరయ్య 14రోజుల రిమాండ్‌కు ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలా ఉండగా.. గ్రూప్–1 పరీక్షకు ముందురోజు నిందితుడికి దగ్గర ప్రశ్నపత్రం ఉన్నదని, ఈ విషయంలో ఇతరులతో ఉన్న సంబంధాల గురించి విచారించేందుకు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పిటిషన్‌లో పేర్కొన్నారు. పూర్తి వివరాలను సేకరించేందుకు సిట్ కస్టడీకి అప్పగించాలని కోరారు. ఇరువర్గాల తరపున వాదనలను వినేందుకు కోర్టు వాయిదా వేసింది. నిందితుడికి చంచల్‌గూడ జైలులో సిట్ అధికారులు నోటీసులు జారీ చేశారు. అదేవిధంగా.. నిందితుడి తరపున బెయిల్ పిటిషన్ సైతం దాఖలైంది. బెయిల్ పిటిషన్‌కు పీపీ కౌంటర్‌ను కోర్టుకు సమర్పించారు. కస్టడీ అనంతరం బెయిల్ పిటిషన్‌పై వాదనలు కొనసాగనున్నాయి. ప్రధాన నిందితుడు పులిదిండి ప్రవీణ్‌కుమార్ బెయిల్ పిటిషన్ తీర్పు హైకోర్టులో పెండింగ్‌లో ఉంది. త్వరలో ప్రవీణ్ బెయిల్‌పై హైకోర్టు తీర్పును ప్రకటించనుంది.

## కస్టమర్ల రూపంలో వచ్చి..

### ఖరీదైన చీరలు కొట్టేశారు

బంజారాహిల్స్, నవంబర్ 6: కస్టమర్ల అవతారంలో వస్త్ర దుకాణంలోకి ప్రవేశించారు. నిర్వాహకుల దృష్టి మరల్చి ఖరీదైన చీరలు తస్కరించారు. ఈ ఘటన జూబ్లీహిల్స్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నం. 36లోని కంకటాల పట్టు చీరల షోరూమ్‌లో గత నెల 29న మధ్యాహ్నం నలుగురు మహిళలతో కలిసి ఓ వ్యక్తి వచ్చాడు. చీరలు చూపించాలంటూ కోరగా.. అక్కడి సిబ్బంది పలు రకాల పట్టు చీరలను చూపించారు. సుమారు గంటపాటు షాపింగ్ చేస్తున్నట్లు నటించిన అనంతరం.. తమకు చీరలు నచ్చలేదంటూ వారు వెళ్లిపోయారు. కాగా, వారాంతంలో స్టాక్‌ను పరిశీలిస్తుండగా.. ఖరీదైన 3 పఠాన్ పటోల చీరలు తగ్గాయి. దీంతో షాపులోని సీసీ కెమెరాలను పరిశీలించగా.. కస్టమర్ల రూపంలో వచ్చిన ఐదుగురు వ్యక్తులు వాటిని తస్కరించినట్లు తేలింది. ఈ మేరకు కంకటాల స్టోర్ మేనేజర్ నిమ్మల రవితేజ సోమవారం జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు ఐపీసీ 379, 420 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ప్రేమ పేరుతో నమ్మించి.. యువతిపై లైంగికదాడి

వెంగళరావునగర్, నవంబర్ 6: ప్రేమ పేరుతో నమ్మించి.. పెండ్లి చేసుకుంటానని మభ్యపెట్టి యువతిపై లైంగికదాడికి పాల్పడిన యువకుడిపై ఎస్ఆర్ నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ పి.వి.రామప్రసాదరావు కథనం ప్రకారం.. ఎస్ఆర్ నగర్ లోని ఓ హాస్టల్‌లో ఉంటున్న యువతి (22)కి స్నేహితురాలి ద్వారా దిలీప్ కుమార్ (25) పరిచయమయ్యాడు. 2022, నవంబర్ నుంచి ప్రేమిస్తున్నానని వెంటపడ్డాడు. ఇందుకు యువతి నిరాకరించింది. పెండ్లి చేసుకుంటానని నమ్మించి ఒత్తడి తీసుకురావడంతో యువతి అంగీకరించింది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఉద్యోగాన్వేషణలో యువతి చెన్నైకి వెళ్లింది. ఆమె వెంట దిలీప్‌కుమార్ కూడా వెళ్లాడు. పెండ్లి చేసుకుంటానని నమ్మించి ఓ హోటల్‌కు తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత చెప్పాపెట్టకుండా కడపకు వెళ్లిపోయాడు. పెండ్లి చేసుకొమ్మని బాధితురాలు ఫోన్ చేయగా.. ఆమెను బెదిరించడం మొదలుపెట్టాడు. యువతి ఎస్ఆర్ నగర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఈ ఘటన చెన్నై పరిధిలో జరగడంతో అక్కడికి కేసును బదిలీ చేయనున్నారని తెలిసింది.